

ముందుగానే నైరుతి

జిల్లాకు ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే చేరనున్నాయి. శాస్త్రవేత్తలు ఈ విషయం వెల్లడించారు. 8లో



టీడీపీ నేతల పరస్పర దాడులు

టీడీపీ నేతలు రచ్చకెక్కారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. రక్తగాయాలతో ఆస్పత్రుల్లో చేరారు. 8లో

గరిష్టం/కనిష్టం
40.2°/23.4°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం అధికంగా కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రేపు కల్లితండాకు వైఎస్ జగన్

- మురళీనాయక్ కుటుంబాన్ని పరామర్శించనున్న మాజీ సీఎం



సాక్షి, పుట్టపర్తి: పాకిస్తాన్ ముష్కరుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన ముడావత్ మురళీనాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 13న గోరంట్ల మండలం కల్లితండాకు రానున్నారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు బెంగళూరులోని నివాసం నుంచి రోడ్డు మార్గం గుండా బయలుదేరి చిక్కబళ్లాపురం, కొడికొండ చెక్‌పోస్టు, పాలసముద్రం, గుమ్మయ్యగారిపల్లి మీదుగా 11.30 గంటలకు కల్లి తండాకు చేరుకుంటారు. వీరజవాన్ మురళీ నాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరామ్ నాయక్‌ను పరామర్శించి, ధైర్యం చెప్పనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు తిరిగి బెంగళూరుకు పయనమవుతారు.

నేడు గార్లదిన్నెలో 'పరిష్కార వేదిక'

అనంతపురం అర్బన్/గార్లదిన్నె: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం గార్లదిన్నెలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. తహసీల్దారు కార్యాలయం పక్కన ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలని సూచించారు.

సింహ, చంద్రప్రభ వాహనాలపై నృసింహుడి వైభవం



సింహవాహనంపై లక్ష్మీనృసింహస్వామి

ఉరవకొండ రూరల్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి వారు సింహ, చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం స్వామి వారికి మహాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారిని సింహ, చంద్రప్రభ వాహనాలపై ఆసీనులను చేసి ఆలయ పురవీధుల్లో ఊరేగించగా.. భక్తులు శ్రీవారిని దర్శించుకుని పరవశించారు. అంతకుముందు లక్ష్మీనృసింహుని జయంతి సందర్భంగా పుష్పాలతో మూలవిరాట్‌ను అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీ స్వామి, ఈఓ సాకే రమేష్‌బాబు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. భక్తులు స్వామి వారి దర్శనానికి క్యూ కట్టారు.

కల్లి తండా.. కన్నీటి సంద్రం



కన్నపేగు కన్నీటి వేదన చూసి.. పుట్టిన తండా నుంచి మంచు కొండల శిఖరాల వరకు గుండె తడి చేసుకుంది. సైనిక దుస్తుల్లో కన్నీళ్లను కనిపించకుండా చివరి వీడ్కోలు పలికిన సహచరులను చూస్తూ.. భరతజాతి యావత్తూ సెల్యూట్ చేసింది. చిన్ననాటి జ్ఞాపకాలు కళ్లలో మెదులుతుండగా.. మన వీరుడి భౌతికకాయం చూసి యావత్ గూడెం గుండె తరుక్కుపోయింది. దేశాన్ని భద్రంగా గుండెల్లో దాచుకున్న వీరుడా.. ధీరుడా.. కోట్లాది హృదయాల్లో కొలువైన ఓ అమరుడా.. మన దేశం కోసం మళ్లీ ఎప్పుడు జన్మిస్తావ్.. అంటూ కల్లితండాతో పాటు యావత్ భారత్ ప్రార్థిస్తోంది.

- వీరజవాన్ మురళీనాయక్‌కు అంతిమ వీడ్కోలు
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- భౌతికకాయం సందర్శించేందుకు తరలివచ్చిన ప్రజలు
- మార్మోగిన జయహో భారత్.. జైహింద్.. మురళి అమర్‌రహే నినాదాలు



మురళీనాయక్ భౌతికకాయం

కల్లితండాలో అశేష జనవాహిని నడుమ జవాన్ అంతిమయాత్ర

'ఎంతమంది వచ్చినా.. ఎంత డబ్బులు ఇచ్చినా.. మా కొడుకును తెచ్చి ఇవ్వలేరు కదయ్యా. ఒక్కగానొక్క సంతానం. దేశం కోసం ప్రాణాలు వదిలాడు. దేశం మొత్తం గర్వపడుతున్నా.. మా ఇంట మాత్రం ఆనందం ఇక ఉండదు. ఎవరిని చూసి ఆనందపడాలయ్యా'

– మురళినాయక్ తల్లి జ్యోతిబాయి

'యావత్ దేశం మా బిడ్డ గురించి మాట్లాడుతున్నారు. కానీ ముసలి వయసులో మాకు అండగా ఉండాల్సిన మా కొడుకు.. ఎప్పుడొస్తాడు.. మాకు ఈ వయసులో దిక్కు ఎవరు సారూ.. మమ్మల్ని ఎవరు చూసుకుంటారు. ఆస్తులు, అంతస్తులు ఎవరి కోసం?'

– మురళినాయక్ తండ్రి శ్రీరామ్‌నాయక్

'జోహార్ మురళి నాయక్. నీ ధైర్యం ఈ నేలకు గర్వ కారణం. నీ త్యాగం ఈ జాతి గుండెల్లో శాశ్వతం. నీ మరణం వృథా కాదు.'

– బెంగళూరు నుంచి అంత్యక్రియలకు వచ్చిన కాలేజీ స్నేహితుడు ఎస్.మహేందర్

'ఈరోజు బార్డర్‌లో డ్యూటీ వేశారు. ఉదయం నా నుంచి కమ్యూనికేషన్ వస్తే నేను పునర్జన్మ ఎత్తినట్లే. ఏదైనా జరిగితే మా తల్లిదండ్రులను బాగా చూసుకో'

– స్నేహితుడు వినోద్‌తో చివరిరోజున మురళీనాయక్ మాటలు



కుమారుడి భౌతికకాయం వద్ద విషణ్ణవదనంలోనే సెల్యూట్ చేస్తున్న జ్యోతిబాయి, శ్రీరామ్‌నాయక్



జవాన్ మురళీ నాయక్‌కు సైనిక వందనం సమర్పిస్తున్న దృశ్యం

సాక్షి, పుట్టపర్తి: కల్లితండా శోకసంద్రంగా మారింది. అగ్నివీర్ మురళీనాయక్ అంత్యక్రియలతో యావత్ భారతావని కల్లి తండా వైపు చూసింది. 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా ఈ నెల 9న పాకిస్తాన్ ముష్కరుల తూటాలకు కశ్మీర్‌లో అశువులు బాసిన ముడావత్ మురళీనాయక్ అంత్యక్రియలు ఆదివారం ఉదయం స్వగ్రామం కల్లితండాలో జరిగాయి. 11 గంటల తర్వాత ప్రభుత్వ, సైనిక లాంఛనాల నడుమ కుటుంబ పెద్దల సమక్షంలో సంప్రదాయ పద్ధతిలో మృతదేహాన్ని ఖననం చేశారు. అంత్యక్రియల్లో పాల్గొన్న వారిలో ఎవరిని పలకరించినా భావోద్వేగానికి గురయ్యారు. మురళితో ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కంటతడి పెట్టారు. దేశం కోసం తండావాసి పోరాటం చేశాడనే గర్వం ఓ వైపు ఉన్నప్పటికీ.. ప్రాణాలు కోల్పోయాడనే బాధ ఆగడం లేదని ప్రతి ఒక్కరి మాటలోనూ కనిపించింది. అగ్నివీర్ మురళీ నాయక్ భౌతికకాయం చూసేందుకు ఆదివారం ఉదయం నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి తండోప తండాలుగా తరలివచ్చారు. దారులన్నీ కల్లితండా వైపు సాగాయి. మురళీనాయక్‌తో పరిచయం లేకున్నా.. యుద్ధవీరుడు.. దేశం కోసం వీర మరణం పొందిన జవాన్‌ను కడసారి చూసేందుకు వచ్చినట్లు చాలామంది చెప్పారు.

కల్లితండా నుంచి కశ్మీర్ వరకు..

మురళీనాయక్ జన్మించింది ఓ మారుమూల గ్రామం. గోరంట్ల మండల కేంద్రానికి సమీపంలోనే ఉంటుంది. జ్యోతిబాయి, శ్రీరామ్‌నాయక్ దంపతులు మురళి జన్మించిన తర్వాత సోమందేపల్లిలోని బంధువుల ఇంట వదిలి.. దంపతులిద్దరూ పొట్టచేత పట్టుకుని ముంబయి వలస వెళ్లారు. ఈ క్రమంలో మురళీనాయక్ సోమందేపల్లిలో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతపురంలో కళాశాల విద్య అభ్యసించి.. 2022లో.. 851 లైట్ రెజిమెంట్‌లో చేరాడు. తొలుత అసోంలో పని చేసి ఆ తర్వాత కశ్మీర్‌కు బదిలీ అయ్యాడు. పహల్గాంలో పాక్ ఉగ్రవాదుల దుశ్చర్య నేపథ్యంలో భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. ఇరు దేశాల మధ్య సరిహద్దున (ఎల్‌ఓసీ – లైన్ ఆఫ్ కంట్రోల్) జరిగిన కాల్పుల్లో మురళీ నాయక్ వీర మరణం పొందాడు.

మువ్వన్నెల జెండా రెపరెపలు..

పాకిస్తాన్ ముష్కరులతో దేశం కోసం వీరోచితంగా పోరాడి ప్రాణాలు వదిలిన మురళీనాయక్ స్వగ్రామం కల్లితండాలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. మురళి భౌతికకాయం చూసేందుకు వచ్చిన వాళ్లలో చాలామంది జాతీయ జెండా చేత పట్టుకుని 'భారత్ మాతా కీ జై.. జోహార్ మురళీనాయక్.. మురళీనాయక్ అమర్ రహే.. జై హింద్.. అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఖబడ్దార్.. ఖబడ్దార్.. పాకిస్తాన్ ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు.

మళ్లీ ఎప్పుడొస్తావ్ చిన్నోడా..?

కల్లి తండాలోని మురళీనాయక్ ఇంటి నుంచి సొంత పొలంలో అంత్యక్రియలకు ఏర్పాటు చేసిన ప్రదేశం వరకు దారి పొడవునా జనాలు సెల్యూట్ చేస్తూ ముందుకు సాగారు. 'మళ్లీ ఎప్పుడొస్తావ్ చిన్నోడా? నీ పుట్టుక ఎవరికీ తెలియదు.. కానీ నీ మరణం యావత్ భారతావనికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తివి బిడ్డా నువ్వు' అంటూ గ్రామంలోని పలువురు చేయి పైకెత్తి నినదించారు. గోరంట్ల, గుమ్మయ్యగారిపల్లి, పుట్లగుండ్లపల్లి నుంచి కల్లి తండా వరకు జవాన్‌కు అశ్రు నివాళి తెలుపుతూ ఫ్లెక్సీలు వెలిశాయి.



మురళీనాయక్ తల్లిని ఓదారుస్తున్న డిప్యూటీ సీఎం పవన్, చిత్రంలో హోం మంత్రి అనిత, మంత్రులు లోకేష్, సత్యకుమార్, అనగాని, సవిత



వీరజవాన్ భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు ఉషశ్రీ చరణ్, ప్రకాష్‌రెడ్డి, దీపిక, మక్బూల్, ఈరలక్కప్ప, అత్తార్ చాంద్‌బాషా

ప్రముఖుల నివాళి..



వీరజవాన్ మురళీనాయక్‌కు సెల్యూట్ చేసి వీడ్కోలు పలుకుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, సైనికులు, ప్రజానీకం

గోరంట్ల: పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్ భౌతికకాయాన్ని మిలటరీ, ప్రభుత్వ అధికారులు శనివారం రాత్రి బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో మిలటరీ వాహనంలో కల్లితండాకు తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు మురళీనాయక్ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. వేలాదిమంది ప్రజలు, బంధుమిత్రులు, గ్రామస్తులతో పాటు అధికారులు, రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు కల్లితండాకు చేరుకుని మురళీనాయక్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత, మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్, సవిత, అనగాని సత్యప్రసాద్, ఎంపీ బీకే పార్థసారథి, పుట్టపర్తి, కదిరి, మడకశిర, రాయదుర్గం ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, కందికుంట వెంకట ప్రసాద్, ఎంఎస్ రాజు, కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు మురళీనాయక్ భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, పార్టీ మడకశిర, హిందూపురం, కదిరి నియోజకవర్గాల సమన్వయకర్తలు ఈరలక్కప్ప, దీపిక, మక్బూల్‌తో పాటు అత్తార్ చాంద్‌బాషా, పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి వీరజవాన్‌కు నివాళులర్పించారు. జవాన్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరామ్‌నాయక్‌ను పరామర్శించారు.



మురళీ నాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తున్న యువత



జవాన్‌ను కడసారి చూసేందుకు తరలివచ్చిన ప్రజలు



వీరజవాన్ మురళీ నాయక్‌కు నివాళులర్పిస్తున్న మహిళలు తదితరులు

ఆ 10 ఎకరాలపై స్టేటస్‌కో

- విద్యారణ్య నగర్‌లో ఇళ్ల నిర్మాణాల కూల్చివేతపై హైకోర్టును ఆశ్రయించిన బాధితులు
- 106–1, 106–2, 119–1, 119–2 సర్వే నంబర్లలో 10 ఎకరాలపై స్టేటస్‌కో
- హెచ్చరిక బోర్డు నాటిన బాధితులు





విద్యారణ్యనగర్‌లో భవనాలను కూల్చేస్తున్న దృశ్యం (ఫైల్), ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన బాధితులు

రాప్తాడురూరల్: 'హైకోర్టు ఆదేశాలు' అంటూ అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం పంచాయతీ పాపంపేట సర్వే నంబరు 106–1లోని 68 సెంట్లలో పెద్దపెద్ద భవనాలను రెవెన్యూ అధికారులు ఇటీవల తొలగించారు. ఈ వ్యవహారంపై శ్రీ విద్యారణ్య గురుకుల వైదిక పాఠశాల సంఘం అధ్యక్షుడు పట్నం శివప్రసాద్ హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ, పోలీసు అధికారులు భవనాలను తొలగించారంటూ పేర్కొన్నారు. రెవెన్యూ ప్రిన్సిపల్ కార్యదర్శి, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆర్డీఓ, తహసీల్దార్, రూరల్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ, జీఎల్‌ఎన్ శ్రావణ్ కుమార్, జి. హరిప్రసాద్, జి.నరేంద్రబాబు, జి.రమాశంకర్‌ను ప్రతివాదులుగా చేర్చారు. 68 సెంట్లు కాదు...106–1 సర్వేనంబరులో 4.86 ఎకరాలు, 106–2 సర్వే నంబరులో 4.20 ఎకరాలు, 119–1, 119–2 సర్వే నంబర్లలో 94 సెంట్లు కలిపి మొత్తం 10 ఎకరాలు తమదేనని పిటీషనర్ పేర్కొన్నారు. దీనిపై వాదోపవాదనలు విన్న తర్వాత నాలుగు రోజుల క్రితం హైకోర్టు డివిజన్ బెంచ్ కీలక తీర్పు వెలువరించింది. 10 ఎకరాలపై స్టేటస్‌కో ఇచ్చింది. ఈ క్రమంలో బాధితులు సదరు భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

అక్రమంగా తొలగించారు..

106–1 సర్వే నంబరులోని ఇళ్లను రెవెన్యూ, పోలీసు అధికారులు అక్రమంగా తొలగించారంటూ బాధితులు వాపోతున్నారు. జీఎల్‌ఎన్ శ్రావణ్‌కుమార్, జి. హరిప్రసాద్, జి.నరేంద్రబాబు, జి.రమాశంకర్ వేసిన పిటీషన్‌పై అనంతపురం మునిసిపాలిటీ పరిధిలోని 106–1 సర్వే నంబరులో సర్వే చేసి 68 సెంట్ల స్థలాన్ని గుర్తించి నివేదిక ఇవ్వాలంటూ 2024 డిసెంబరు 5న తీర్పు ఇచ్చిందన్నారు. దీన్ని పట్టుకుని రెవెన్యూ, పోలీసు అధికారులు దౌర్జన్యంగా సంబంధం లేని రూరల్ పరిధిలోని పాపంపేట పొలంలోని 106–1 సర్వే నంబరులోని 68 సెంట్లలో ఇళ్లను కూల్చివేశారన్నారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

భాగపరిష్కారాల్లోనూ చూపలేదు..

పైన పేర్కొన్న నాలుగు సర్వే నంబర్లలో 10 ఎకరాలను శ్రీ విద్యారణ్య గురుకుల వైదిక పాఠశాల సంఘం, శ్రీ హంపి విద్యారణ్య శంకర భారతి బ్రాహ్మణ వైదిక సంఘం రెండింటికీ 5 ఎకరాల చొప్పున 1949లో ఆ భూమి హక్కుదారులైన రాచూరి, కొండపల్లి కుటుంబాలు దానవిక్రయం చేశాయి. ఈ భూమిలో మూడోవంతు రాచూరి కుటుంబానికి, ఒకటోవంతు కొండపల్లి కుటుంబానికి భాగాలుండేవి. ఈ రెండు కుటుంబాలు 1952లో భాగపరిష్కారాలు చేసుకున్నాయి. దాన విక్రయం చేసిన 10 ఎకరాల భూమి గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. 1962లో గొల్లపల్లి కుటుంబ సభ్యులు భాగ పరిష్కారం చేసుకున్నారు. ఇందులోనూ 10 ఎకరాల గురించి ఎక్కడా ప్రస్తావించలేదని చెబుతున్నారు.

న్యాయం గెలిచింది



హైకోర్టు తీర్పు ఒకటిస్తే ఇక్కడి అధికారులు మరొకటి అమలు చేసి మాకు అన్యాయం చేశారు. అనంతపురం మునిసిపాలిటీ పరిధిలోని 106–1 సర్వే నంబరులోని భూమి గుర్తించాలని స్పష్టంగా చెప్పినా... పోలీసు, రెవెన్యూ అధికారులు బలవంతంగా మా ఇళ్లను తొలగించారు. ఇంట్లో సామాన్లు కూడా ఎత్తుకెళ్లారు. పైగా మానాన్న, మేము కబ్జా చేశామని ఆర్డీఓ పదేపదే అన్నారు. ఏ ఆధారాలతో అన్నారో ఆయనకే తెలియాలి. అధికారులు కబ్జాదారులకు అండగా నిలిచారు. ఈ ఆధారాలను హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు ఉంచాం. చివరకు న్యాయమే గెలిచింది. నాలుగు సర్వే నంబర్లలో పది ఎకరాలు మాకే చెందుతుందని తీర్పు ఇచ్చారు. దీనిపై సుప్రీంకోర్టులోనూ కేవియట్ వేశా.

– పట్నం శివప్రసాద్

తాగుడులో తగ్గేదేలా..

మందుబాబులు మస్త్ ఎంజాయ్ చేస్తున్నారు. నిరంతరాయంగా మందు దొరుకుతోంది. అర్ధరాత్రి అయినా అపరాత్రి అయినా కోరుకున్న బ్రాండ్ చేతికి చేరుతోంది. ప్రశాంతంగా తాగడానికి.. దోస్తులతో కలిసి విందు చేసుకోవడానికి వైన్‌షాపుల వద్ద సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. మందు తాగుతూ ముక్క తింటూ 'స్వర్గం'లో తేలియాడుతున్నారు. కూటమి పాలనలో మందుబాబుల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది.సంపాదించిన సొమ్మంతా తాగుడుకే తగలేస్తున్నారు. ఈ క్రమంలో మద్యం విక్రయాలు దూసుకుపోతున్నాయి.

- 8 నెలల్లో రూ.1,000 కోట్ల వ్యయం
- ఇదీ ఉమ్మడి జిల్లాలో మద్యం వినియోగం
- రూ.215 కోట్లతో అనంతపురం అగ్రస్థానం
- రూ.84 కోట్లతో రెండో స్థానంలో తాడిపత్రి



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా ఇప్పుడు 'మద్యం పురం'గా మారిందన్న విమర్శలున్నాయి. విచ్చలవిడి మద్యం కారణంగా గ్రామాల్లో ఇప్పటికే గొడవలు జరుగుతున్న విషయం తెలిసిందే. రోజురోజుకూ మద్యం వినియోగం పెరుగుతున్నదే తప్ప తగ్గడం లేదు. గత ప్రభుత్వ హయాంలో బహిరంగ మద్యపానం, బెల్టుషాపులు, పర్మిట్ రూములపై ఉక్కుపాదం మోపడంతో మద్యం నియంత్రణలో ఉండేది. కూటమి సర్కారు రాగానే ఎమ్మెల్యేల చేతుల్లోనే మద్యం షాపులు ఉండటంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహారం నడుస్తోంది. తెల్లవార్లూ మద్యం అమ్ముతున్నా అడిగే నాథుడే లేరు. 'సంపద సృష్టిస్తా.. అది పేదలకే పంచుతా' అని పదే పదే చెప్పే చంద్రబాబు..ఇక్కడ మద్యం ద్వారా పేద ప్రజల సొమ్ము దోచుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఊపందుకున్న మద్యం విక్రయాలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం అమ్మకాలు ఎలా ఉన్నాయనేందుకు ఈ లెక్కలే ఉదాహరణ. రెండు జిల్లాల్లో గడిచిన 7 నెలల 25 రోజుల్లో రూ.1,000 కోట్లకు పైగా విలువైన మద్యం అమ్మారు. ఊరూరా బెల్టుషాపులు, అర్బన్ ప్రాంతాల్లో పర్మిట్ రూములతో మూడు పువ్వులు ఆరుకాయలుగా మద్యం వ్యాపారం జరుగుతోంది.

అర్బన్‌లోనే ఎక్కువ..

తాజా గణాంకాలను చూస్తే పట్టణాల్లో మద్యం వినియోగం మరింత ఎక్కువైంది. కొత్తగా మద్యం వినియోగదారులు పెరుగుతున్నారు. అనంతపురం జిల్లాలో రూ.646 కోట్ల విలువైన మద్యం వినియోగం కాగా.. అనంతపురం నగరంలోనే రూ.215 కోట్లకు పైగా మద్యం అమ్ముడైంది.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2024 సెప్టెంబర్ 15 నుంచి 2025 మే 7 వరకు మద్యం వినియోగం

మద్యం వినియోగం (లీటర్లలో)
1,29,52,134

బీరు వినియోగం (లీటర్లలో)
49,58,805

మద్యం, బీరు వినియోగం విలువ
రూ.1031,57,86,251

రోజుకు మద్యం కోసం చేస్తున్న వ్యయం
రూ.4,48,51,244

అనంతపురం జిల్లాలో మద్యం వ్యయం
రూ.646,40,13,304

శ్రీసత్యసాయి జిల్లాలో మద్యం వ్యయం
రూ.385,17,72,946

తాడిపత్రిలో రూ.84 కోట్లు, గుత్తిలో రూ.63 కోట్లు, గుంతకల్లులో రూ. 61 కోట్ల మద్యం వినియోగమైంది. శ్రీసత్యసాయి జిల్లాలో ధర్మవరంలో రూ.86 కోట్లు, హిందూపురంలో రూ.57 కోట్లు, పెనుకొండలో రూ.61 కోట్లు, కదిరిలో రూ.54 కోట్ల విలువైన మద్యం వినియోగమైంది. ఊరూరా బెల్టుషాపుల కారణంగా మద్యం విచ్చలవిడిగా తాగుతున్నట్టు వెల్లడైంది.

క్లుప్తంగా

సింహ వాహనంపై శ్రీవారు



రాయదుర్గం టౌన్: స్థానిక కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం దేవేరులతో కలసి సింహవాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో ధ్వజారోహణ, యాగశాల ప్రవేశ, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యప్రభ వాహన సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించాలి

- మాజీ మేయర్ రాగే పరుశురాం



మాట్లాడుతున్న రాగే పరుశురాం

అనంతపురం టవర్‌క్లాక్: ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాజీ మేయర్ రాగే పరుశురాం అన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన కురుబ విద్యార్థులకు ఆదివారం స్థానిక కనకదాస కల్యాణ మంటపంలో ప్రతిభ పురస్కారాలు అందించారు. కార్యక్రమానికి రాగే పరుశురాంతో పాటు అడిషనల్ ఎస్పీ వెంకట్రాముడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కురుబలు తమ పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కనకదాస విద్యా ఉపాధ్యాయ సంక్షేమ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు మర్రిస్వామి, నాయకులు సంజీవరాయుడు, రాజహంస శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనగొండ్ల రాజేష్, వీరనారప్ప, సతీష్, చిత్రా పరుశురాం, నారాయణ స్వామి, ఓబులేసు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనం కూల్చివేతపై కేసు నమోదు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడలో ఎలాంటి అనుమతులు లేకుండా పశువైద్యశాల భవనాన్ని కూల్చివేశారని మండల పశువైద్యాధికారి వెంకటరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. 2001లో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరిందని, దీంతో మరో భవనంలో విధులు నిర్వహించాల్సి వస్తోందని తన ఫిర్యాదులో వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి తరుణంలో భవనాన్ని గ్రామానికి చెందిన శరణబసప్ప, చిదానంద కూల్చి స్థలాన్ని ఆక్రమించినట్లుగా వివరించారు. దీంతో ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రైవేటు టీచర్ల మెడపై.. అడ్మిషన్ల కత్తి!



- ఎన్నికల ప్రచారంలా ఊరూరా క్యాంపెయినింగ్
- టెక్నో, ఈ టెక్నో, సీబీఎస్‌ఈ పేరుతో విద్యార్థులకు వల
- చాలా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువు
- తడిసిమోపెడవుతున్న ఫీజులు

రాయదుర్గం: ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులపై అడ్మిషన్ల కత్తి వేలాడుతోంది. 2025–26 విద్యా సంవత్సరానికి నెల రోజుల ముందే విద్యార్థుల ప్రవేశాలకు టార్గెట్ విధిస్తూ.. సిబ్బందిని ఆయా పాఠశాలల యాజమాన్యాలు వేధింపులకు గురిచేస్తున్నాయి. పిల్లలను చేర్పిస్తేనే కొలువు ఉంటుందని, లేకపోతే ఇతర జీవనోపాధులు చూసుకోవాలంటూ హెచ్చరికలు జారీ చేశాయి. దీంతో తమ ఉద్యోగ భద్రత కోసం ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులను ప్రాధేయపడుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక పాఠశాలలు 3,243, ప్రాథమికోన్నత 502, ఉన్నత పాఠశాలలు 1,539 ఉన్నాయి. వీటిలో 1,270కు పైగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, ఉన్నాయి. వీటన్నింటిలో 2024–25 విద్యా సంవత్సరంలో 1 నుంచి 8వ తరగతి వరకు చదివే విద్యార్థులు 3,57,363 మంది, 9 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు 87,897 మంది ఉన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు వేసవి సెలవుల్లోనే తరగతుల వారీగా అడ్మిషన్ల వేట మొదలు పెట్టాయి. ఇందు కోసం తమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టార్గెట్లు నిర్దేశించి అడ్మిషన్లు చేయించగలిగితేనే ఉద్యోగాలు ఉంటాయని, లేకపోతే ఇంటికెళ్లాల్సి ఉంటుందని హెచ్చరికలు జారీ చేశాయి. ఈ వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో రాయదుర్గంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళా ఉపాధ్యాయులు ఉద్యోగాలు మానుకున్నారు.



ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు కోరుతూ విద్యార్థి సంఘాలు చేపట్టిన ఆందోళన (ఫైల్)

భారీగా ఫీజులు..

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఫీజులు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఈ నిబంధన జిల్లాలోని ఏ ప్రైవేట్ పాఠశాలలోనూ అమలు కావడం లేదు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయి నుంచే భారీగా ఫీజులు దండుకుంటున్నారు. టెక్నో, ఈ టెక్నో, సీబీఎస్‌ఈ, ఐఐటీ కోచింగ్, అబాకస్, స్పోకెన్ ఇంగ్లిష్, కరాటే, డ్రాయింగ్, బాక్సింగ్, పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారాన్ని మోపుతున్నారు. దీనికి అదనంగా యూనిఫాంలు, పుస్తకాలు, నోట్‌బుక్స్, బూట్లు, సాక్సులు, టై లాంటివి ఆయా పాఠశాలల్లోనే అధిక ధరకు విక్రయాలు చేపట్టారు.

చర్యలు తీసుకోవాలి



అడ్మిషన్ల పేరుతో ప్రైవేటు ఉపాధ్యాయుల్ని యాజమాన్యం వేధింపులకు గురిచేస్తోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లోనే అడ్మిషన్లు మొదలు పెట్టారు. దీనికి వ్యతిరేకంగా ఇటీవల రాయదుర్గంలోని నారాయణ స్కూల్ ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కూడా నిర్వహించాం. విద్యాశాఖ అధికారులు పరిశీలించి కట్టడి చేయాలి. ముందస్తు పాఠ్య, నోట్ పుస్తకాలు, షూ, బెల్టు లాంటి విక్రయాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలి.

– ఆంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి, రాయదుర్గం.

అడ్మిషన్ల పేరుతో వేధిస్తే చర్యలు

అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులను , టీచర్లను వేధింపులకు గురిచేస్తే ప్రైవేటు పాఠశాలల యజమానులపై కఠిన చర్యలు చేపడతాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాకే అడ్మిషన్లు చేపట్టాలి. దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ప్రతి ఒక్కరు ప్రభుత్వ బడుల్లో చేరేలా అవగాహన కల్పిస్తున్నాం.

– ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

చాలీచాలని వేతనాలు..

ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు యాజమాన్యాలు చాలీచాలని వేతనాలిస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ప్రాథమిక స్థాయి విద్యాబోధకులకు నెలకు రూ.4,500 నుంచి రూ.5 వేలు చొప్పున చెల్లిస్తున్నాయి. ప్రభుత్వ జీఓ ప్రకారం విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజులో 59 శాతం ఉపాధ్యాయుల వేతనాలకు కేటాయించాలి. కానీ, ఈ విధానం ఎక్కడేగాని అమలు కావడం లేదు.

సేవకు ప్రతిరూపం.. స్టాఫ్‌నర్సులు

- నేడు ప్రపంచ నర్సుల దినోత్సవం

అనంతపురం మెడికల్: ప్రాణాపాయ స్థితిలో, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు మెరుగైన సేవలందించి, వారిని మామూలు స్థితికి తీసుకురావడంలో స్టాఫ్‌నర్సులకు సాటి మరెవ్వరూ లేరు. సాధారణంగా వైద్యులు రోగిని పరీక్షించి అవసరమైన సేవలను రాసి పెట్టి వెళ్లిపోతుంటారు. ఆ తర్వాత రోగిని 24 గంటలూ కంటికి రెప్పలా చూసుకుంటూ వైద్య సేవలు అందించడంలో స్టాఫ్‌నర్సులే కీలకంగా ఉంటారు. ఈ క్రమంలోనే స్టాఫ్ నర్సుల సేవలపై ప్రజలను చైతన్యపరిచేలా ఏటా నర్సుల దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఇటలీ దేశానికి చెందిన నర్సు ఫ్లోరెన్స్ నైటింగేల్ 1854–55లో క్రిమియాలో జరిగిన యుద్ధంలో గాయపడిన సైనికులకు విశేష సేవందించారు. ఆమె సేవలకు గుర్తుగా ఏటా మే 12న ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆస్పత్రుల్లో సోమవారం నర్సుల దినోత్సవాన్ని వైభవంగా జరుపుకునేందుకు నర్సులు సిద్ధమయ్యారు.

కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి..

జిల్లాలో 2020 మార్చి నుంచి కోవిడ్ నియంత్రణలో నర్సులు ప్రాణాలకు తెగించి సేవలు అందించారు. మొదటి మూడు దశల్లో 25,47,582 మంది కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేసుకోగా, వీరిలో 1,77, 596 మంది కోవిడ్ బారిన పడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 45,327 మంది, కోవిడ్ కేర్ సెంటర్లలో 64,200 మంది చికిత్స పొందారు. అప్పట్లో ప్రభుత్వ సర్వజనాస్పత్రితో పాటు జిల్లా వ్యాప్తంగా ఆస్పత్రుల్లో దాదాపు 2,360 మందికి పైగా స్టాఫ్‌నర్సులు సాహసోపేతమైన విధులు నిర్వర్తిస్తూ కోవిడ్ బారిన పడిన వారు కోలుకునేలా చేశారు. ఈ క్రమంలో వీరిలో 20 నుంచి 30 శాతం మంది కోవిడ్ బారిన పడినా.. కోలుకున్నాక తిరిగి ధైర్యంగా విధుల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి స్టాఫ్‌నర్సుల సేవలకు గుర్తుగా రాష్ట్రస్థాయి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించింది.



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని స్టాఫ్‌నర్సులు

అనంతను అగ్రస్థానంలో నిలుపుతాం



రోగులకు మెరుగైన సేవలందించడంలో స్టాఫ్‌నర్సుల పాత్ర చాలా కీలకం. క్షతగాత్రులు, ప్రాణాపాయ కేసులు, శస్త్రచికిత్సలు, సిజేరియన్, సాధారణ ప్రసవాలు తదితర సేవల్లో స్టాఫ్‌నర్సులు అంకితభావంతో పనిచేస్తున్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయిలో అనంతపురం సర్వజనాస్పత్రిని ప్రథమ స్థానంలో నిలుపుతాం.

– నాగమణి, గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్, సర్వజనాస్పత్రి

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



గాయపడిన పెద్దన్న

పుట్లూరు: మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పెద్దన్నపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వద్ద టీడీపీ నాయకులు మద్యం అమ్మకాలు జరుపుతుండడంతో పెద్దన్న అభ్యంతరం తెలిపాడు. దీంతో టీడీపీ కార్యకర్త నవీన్‌తో పాటు మరికొందరు ఆదివారం దాడికి తెగబడినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి



గాయపడిన ఆంజనేయులు

పెద్దవడుగూరు: మండలంలోని గుత్తిఅనంతపురం గ్రామానికి చెందిన తప్పెళ్ల ఆంజనేయులుపై శనివారం రాత్రి కత్తితో దాడి చేశారు. బండిఘాల తిరునాలలో శివ, సాయితో ఆంజనేయులుకు గొడవ జరిగింది. స్థానికులు సర్ది చెప్పి పంపారు. రాత్రి మటన్ పంచుకునే సమయంలో ఆంజనేయులుపై శివ, సాయి కత్తి దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పీఆర్సీ వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: పీఆర్సీ 12వ కమిటీ చైర్మన్‌ను వెంటనే నియమించి పీఆర్సీ ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో యూటీఎఫ్ ఉద్యమ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు ఆలస్యమైతే ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలన్నారు. మెమో 57 ప్రకారం 2004 సెప్టెంబరుకు ముందు నియామకమైన 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. టీచర్ల బదిలీల జీఓను వెంటనే విడుదల చేసి వేసవిసెలవుల్లోనే బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఎస్టీటీలకు మ్యానువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు బదిలీల్లో కొత్తగా మంజూరైన పోస్టులను ఖాళీలుగా చూపాలన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ.. పదోన్నతుల సీనియార్టీకి సంబంధించిన సమస్యలు పరిష్కరించాలన్నారు. యూటీఎఫ్ నాయకులు ఈశ్వరయ్య, రమణయ్య, హనుమంత రెడ్డి, రవికుమార్, సుబ్బరాయుడు, శేఖర్, రాముడు, చంద్రమోహన్, దేవేంద్రమ్మ పాల్గొన్నారు.

కెంచంపల్లిలో చిరుత కలకలం

కుందుర్పి: మండలంలోని కెంచంపల్లిలో ఆదివారం అర్ధరాత్రి చిరుత కలకలం రేపింది. గొర్రెల మందపై దాడి చేయడంతో కుక్కలు చుట్టుముట్టాయి. దీంతో చిరుత సమీపంలోని కొబ్బరి చెట్టు ఎక్కింది. అదే సమయంలో మేల్కొన్న గొర్రెల కాపరులు కేకలు వేస్తూ బెదరగొట్టడంతో గుట్టల్లోకి పరుగు తీసినట్లు గొర్రెల కాపరి ఈరన్న తెలిపాడు.

ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ కీలకం

- తప్పులను ఎత్తిచూపి, విమర్శించే హక్కు పత్రికలకు రాజ్యాంగం కల్పించింది
- 'సాక్షి' ఎడిటర్ నివాసంలో పోలీసుల తనిఖీలు మీడియాపై దౌర్జన్య ధోరణికి నిదర్శనం
- ఇది ముమ్మాటికీ రాజకీయ దృష్టితో జరిగిన దాడే



అనంతపురం ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్య మనుగడలో పత్రికల పాత్ర చాలా కీలకమని, ప్రభుత్వాల తప్పులను ఎత్తిచూపి, పాలకులను గాడిన పెట్టే హక్కు పత్రికలకు రాజ్యాంగం కల్పించిందని పలువురు మేధావులు స్పష్టం చేస్తున్నారు. న్యాయ వ్యవస్థకు స్వయం ప్రతిపత్తి ఎంత అవసరమో...పత్రికా స్వేచ్ఛకు కూడా అంతే అవసరమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, అకారణంగా 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంలో పోలీసుల చేపట్టిన తనికీలు అప్రజాస్వామిక విధానమేనని స్పష్టం చేస్తున్నారు. మీడియాపై రోజురోజుకూ పెరుగుతున్న దౌర్జన్య ధోరణికి ఇది నిదర్శనమని అంటున్నారు. ఇది ముమ్మాటికీ రాజకీయ దృష్టితో జరిగిన దాడేనని స్పష్టం చేస్తున్నారు. ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసుల తనఖీలను పౌర సమాజం తీవ్ర ఖండిస్తోంది.

స్వయం ప్రతిపత్తి అవసరం

న్యాయ వ్యవస్థకు స్వయం ప్రతిపత్తి ఎంత అవసరమో...పత్రికా స్వేచ్ఛకూ అంతే అవసరం. పత్రికలను ఇది రాయాలి...అది రాయాలి అని మనం మాట్లాడకూడదని ఇటీవల సుప్రీంకోర్టు జడ్జి ఓ కేసు విషయంగా వ్యాఖ్యలు చేశారు. పత్రిక స్వేచ్ఛను ఎవరూ నియంత్రించాలని చేయకూడదని కూడా స్పష్టం చేశారు. అలాంటి ప్రయత్నాలు చేస్తే ప్రజాస్వామిక వ్యవస్థలకు విఘాతం అని వ్యాఖ్యానించారు. బయట నుంచి పత్రికలను నియంత్రించాలని చూస్తే బెడిసి కొడుతుంది.

– చంద్రశేఖర్, మానవ హక్కుల వేదిక ఉమ్మడి రాష్ట్రాల కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు

ప్రభుత్వ ధోరణిని ఖండిస్తున్నాం



సాక్షి సంపాదకులు ధనుంజయరెడ్డి ఇంటిపై ఇటీవల పోలీసులు జరిపిన చట్ట విరుద్ధమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. సెర్చ్ వారెంటు లేకుండా, అనుమతి లేకుండా ప్రవేశించి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం దారుణం. ఈ తరహా చర్యలు మౌలిక హక్కులను హరించడమే కాక, నిష్పక్షపాతంగా వార్తలు అందించే ప్రయత్నాలను అణచివేసే కుట్రలో భాగమేనని భావించాల్సి వస్తుంది. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరిపించాలి. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలి.

– రామ్‌కుమార్, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) జిల్లా అధ్యక్షుడు

రాజకీయ దృష్టితో జరిగిన దాడే



సాక్షి ఎడిటర్ ఇంటిపై జరిగిన పోలీసు దాడి కేవలం రాజకీయ దృష్టితో జరిగిన దాడిగానే కనిపిస్తోంది. ఇది పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడి. దీనిని ప్రజాస్వామిక వాదులందరూ ఖండించాలి. పోలీసులు చట్టాన్ని అతిక్రమించి, పత్రికలను టార్గెట్ చేయడం అనుమతించరాదు. చూసీచూడనట్టు పోతే అది సమాజానికి నష్టదాయకమవుతుంది. సాక్షి ఎడిటర్ విషయంలో చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ గేయానంద్, మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు

సీనియారిటీ సమస్యను పరిష్కరించాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మునిసిపాలిటీ స్కూళ్ల టీచర్ల సీనియార్టీ సమస్యను పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, అనంతపురం, హిందూపురం, కదిరి, ధర్మవరం మునిసిపాలిటీల్లో 2012 డీఎస్సీకి సంబంధించి జాయినింగ్ తేదీని ఒక్కో మునిసిపాలిటీలో ఒక్కో విధంగా నమోదు చేశారని గుర్తు చేశారు. కదిరి మునిసిపాలిటీలో 2013 జనవరి 2గా, తాడిపత్రి మునిసిపాలిటీలో 2012 డిసెంబరు 31గా, ధర్మవరం మునిసిపాలిటీలో 2013 జనవరి 10గా, రాయదుర్గం మునిసిపాలిటీలో 2013 జనవరి 5గా, హిందూపురం మునిసిపాలిటీలో 2013 జనవరి 4గా నమోదు చేశారన్నారు. ఒకే డీఎస్సీ ద్వారా రిక్రూట్ అయినప్పటికీ జాయినింగ్ తేదీలు వేర్వేరుగా ఉండడం వలన సీనియారిటీకి, తర్వాత పొందే పదోన్నతులకు ఇబ్బందిగా మారుతోందన్నారు. సమస్య పరిష్కారానికి వీరందరికీ కామన్ జాయినింగ్ తేదీ 2012, డిసెంబరు 31గా నమోదు చేయాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సుధాకరన్ తదితరులు ఉన్నారు.

ముందుగానే 'నైరుతి'

అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాలు (సౌత్‌వెస్టన్ మాన్‌సూన్స్) ఈ సారి ముందుగానే పలకరించే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నెల 27న కేరళ తీరాన్ని రుతుపవనాలు తాకే పరిస్థితి ఉన్నట్లు భారత వాతావరణ శాఖ (ఇండియా మెట్రలాజికల్ డిపార్ట్‌మెంట్) ఆదివారం అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. ఈ క్రమంలో వాతావరణం అనుకూలిస్తే ఉమ్మడి జిల్లాలో జూన్ ఒకటి, రెండో తేదీల్లోనే ప్రవేశించవచ్చని అంచనా వేస్తున్నారు. 2020లో జూన్ ఒకటిన నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాయి. 2021లో జూన్ 3, 2022లో మే 29, 2023లో జూన్ 8, 2024లో మే 30న ప్రవేశించాయి. ఈ సారి మే 31న తాకే అవకాశం ఉన్నట్లు అంచనా వేయగా... తాజాగా నాలుగు రోజులు ముందుగానే మే 27నే పలకరించవచ్చని ప్రకటించడం విశేషం. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాకు కూడా ముందుగానే 'నైరుతి' పలకరించే అవకాశాలు మెండుగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రుతుపవనాల ప్రవేశంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి వర్షాలు కురుస్తాయి.

ఖరీఫ్‌కు కీలకం..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగయ్యే లక్షలాది హెక్టార్ల పంటలకు నైరుతి ప్రభావంతో కురిసే వర్షాలే ఆధారం. జూన్–సెప్టెంబర్ మధ్య నాలుగు నెలల కాలంలో 319.7 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంటుంది. జూన్‌లో 61 మి.మీ, జూలైలో 63.9, ఆగస్టులో 83.8, సెప్టెంబర్‌లో 110.9 మి.మీ మేర వర్షపాతం నమోదు కావాలి. నాలుగు నెలల కాలంలో 30 నుంచి 40 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదు కావొచ్చని, విస్తారంగా వర్షాలు కురిస్తే ఖరీఫ్ సాగు ఊపందుకుంటుందని చెబుతున్నారు.

టీడీపీ నేతల పరస్పర దాడులు



గాయపడిన టీడీపీ కార్యకర్త రమేష్



టీడీపీ సీనియర్ నేత కోనంకి కృష్ణ

తాడిపత్రి: ఓ వివాహ వేడుకలో టీడీపీ నేతల మధ్య పరస్పర దాడులు చోటు చేసుకున్నాయి. తాడిపత్రి మండల పరిధిలోని సజ్జలదిన్నె గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. సజ్జలదిన్నెకు చెందిన టీడీపీ నేత దుబ్బన్న బంధువు కుమారుడి వివాహ వేడుక సందర్భంగా గ్రామంలో శనివారం రాత్రి మెరవణి చేపట్టారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ ప్రముఖుడు సుబ్బయ్య ఇంటి ఎదురుగా మెరవణి వెళుతున్న సమయంలో బాణాసంచా పేల్చేందుకు దుబ్బన్న వర్గీయులు ప్రయత్నించారు. ఆ సమయంలో వారిని సుబ్బయ్య అడ్డుకున్నాడు. అందరూ నిద్రిస్తున్న సమయంలో బాణాసంచా కాల్చరాదని సూచించాడు. దీంతో దుబ్బన్న వర్గీయులు రెచ్చిపోయి సుబ్బయ్యతో వాగ్వాదానికి దిగారు. మాటామాట పెరగడంతో ఇరువర్గాలకు చెందిన పలువురు రాళ్లు రువ్వుకున్నారు. ఘటనలో సుబ్బయ్య వర్గానికి చెందిన రమేష్ తలకు, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

పార్టీ ఆఫీస్‌లోనే ..

గుత్తి: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పార్టీకి చెందిన సీనియర్ నేత కోనంకి కృష్ణ కార్యాలయంలో ఇతర నాయకులతో కలిసి సంస్థాగత ఎన్నికలపై చర్చిస్తుండగా అక్కడకు తన అనుచరులతో కలసి చేరుకున్న టీడీపీ నేత వాసు (జీఆర్పీ కానిస్టేబుల్).. సంస్థాగత ఎన్నికల్లో తన అనుచరులు ఎనిమిది మందికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీనిపై కోనంకి కృష్ణ అభ్యంతరం తెలపడంతో వాసుతో పాటు అతని అనుచరులు బూతులతో రెచ్చిపోతూ దాడికి ప్రయత్నించారు. అక్కడున్నవ ఆరు సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం తనపై జరిగిన దాడిపై తీసిన వీడియోను కోనంకి కృష్ణ విడుదల చేయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అ'పూర్వ'ం.. ఆత్మీయం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రాయదుర్గం టౌన్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఇంటర్ కళాశాలలో 1980–83 విద్యాసంవత్సంలో కలసి చదువుకున్న వారు అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. అప్పట్లో 200 మంది కలసి చదువుకోగా, వీరిలో వంద మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. మనసారా పలకరించుకున్నారు. అప్పటి అధ్యాపకులు ఎవరూ లేకపోవడం కాస్త నిరాశ మిగిల్చిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు, ప్రస్తుత బేలోడు పాఠశాల హెచ్ఎం నాగరాజు, శివానంద, రామదాసు, వెంకటేశులు, శేషప్రభ, కేకేటీ మోహన్, బండి చిన్న, లాయర్ బాబు, ఎర్రిస్వామి తదితరులు నేతృత్వం వహించారు.

క్లుప్తంగా

పవిత్రమైనది హజ్‌యాత్ర



హజ్ యాత్రికులతో మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో హజ్‌యాత్ర సాగుతోందని విజయవంతంగా ముగించుకురావాలని మేయర్ వసీం అన్నారు. ఆదివారం జిల్లా నుంచి హజ్‌కు బయల్దేరుతున్న యాత్రికులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరిని ఆలింగనం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. చాందిని మసీదులో జరిగిన కార్యక్రమంలో మేయర్ వసీం మాట్లాడుతూ.. హజ్‌యాత్ర ఎంతో పవిత్రమైనదని, కఠోర నిష్ఠ, నియమబద్ధంగా ఆచరించాలని ఆకాంక్షించారు. దేశంలో శాంతి నెలకొనేందుకు హజ్ యాత్రికులు సామూహిక దువా చేయాలని సూచించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, కార్పొరేటర్లు రహంతుల్లా, ఇసాక్ మదిని, మౌలానా హారూన్ రషీద్, మసీదు కమిటీ సభ్యులు మునీర్, షబ్బీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్షావలి, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



ఆర్టీసీ బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతపురం: అసాంఘిక శక్తుల అణిచివేతే లక్ష్యంగా జనసమ్మర్ద ప్రదేశాల్లో ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను కనిపెట్టడం, అక్రమ రవాణా నియంత్రించడమే ధ్యేయంగా తనిఖీలు జరిగాయి. జిల్లాలోని ముఖ్య పట్టణాల్లోని ఆర్టీసీ బస్టాండ్లు, ఆర్టీసీ బస్సులు, రైళ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లను పరిశీలించారు. ఆయా పోలీసు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

అమరవీరుడికి ఘన నివాళి



జవాన్ మురళి నాయక్‌కు నివాళులర్పిస్తున్న గాయకులు

అనంతపురం కల్చరల్: 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరీయసి.. ఏ తల్లి నినుకన్నదో ఆ తల్లినే కన్న భూమి గొప్పది రా ' అంటూ గాయనీ గాయకులు సంగీతంతో అమరవీరుడికి అశ్రునివాళులర్పించారు. ఆదివారం రాత్రి స్థానిక హౌసింగ్ బోర్డు ఘంటసాల స్మారక మందిరంలో పద్మశ్రీ ఘంటసాల సంగీత సాంస్కృతిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 'అమరవీరుడికి అశ్రునివాళి' పేరిట కార్యక్రమం నిర్వహించారు. మురళీనాయక్ త్యాగాన్ని శ్లాఘిస్తూ పలు దేశభక్తి చిత్రాల్లోని పాటలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, ఓబుళదాసు, జీవీ రామయ్య తదితరులు మురళీనాయక్, సతీష్, శ్రీదేవి, ఇందిర, పద్మజ, ఓబులు, నోవోమి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధంలో విజయం సాధించాలని పూజలు



ఆలయంలో హోమాలు చేస్తున్న అర్చకులు


ఆత్మకూరు: యుద్ధంలో భారత్ విజయం సాధించాలని కోరుతూ ఆదివారం పంపనూరులోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. దేశ సరిహద్దులో విరోచితంగా పోరాడుతున్న సైనికులకు ధైర్యసాహసాలు ప్రసాదించాలని దుర్గా హోమం, మహా సుదర్శన హోమం, మృత్యుంజయ హోమం నిర్వహించారు. అంతకుముందు సుబ్రహ్మణ్యేశ్వరుడి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు చేశారు. స్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వర్ణ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు చేసి, మహా మంగళ హారతి ఇచ్చారు.

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ ఎల్ఐజీ బస్టాప్ దగ్గర ఒక ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఆకుల నారాయణమ్మ, విటుడు అజయ్‌కుమార్, ఇద్దరు బాధితులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బుద్ధుడి బోధనలు.. శాంతికి ప్రతిరూపాలు

- బౌద్ధానికి పెరుగుతున్న ఆదరణ
- ఆసక్తి పెంచే బౌద్ధమత ఆనవాళ్లు
- పీస్ మెమోరియల్ హాల్‌లో ఆకట్టుకుంటున్న పెయింటింగ్స్, విగ్రహాలు



సందర్భం: నేడు బుద్ధ జయంతి

అనంతపురం కల్చరల్: అష్టాంగ మార్గంతో మనిషి జీవిత విధానం, తలరాతను మార్చిన బౌద్ధానికి గతంతో పోలిస్తే క్రమంగా ఆదరణ పెరుగుతోంది. గౌతమ బుద్ధుడి పేరిట పార్కులు, గ్రంథాలయాలు, ధ్యాన కేంద్రాలు, అధ్యయన ప్రదేశాలు పెరుగుతుండటం గత కొన్నేళ్లగా సాగుతోంది. బుద్ధం శరణం గచ్ఛామి.. సంఘం శరణం గచ్ఛామి అంటూ శాంతికి ప్రతిరూపమైన గౌతమ బుద్ధుడి ఆనవాళ్లు జిల్లా సరిహద్దుల్లోనూ ఉన్నాయన్న విషయం చాలా కొద్ది మందికే తెలుసు. కానీ దశాబ్దాల కిందటే చరిత్రాకారులు ఆయన స్మృతి చిహ్నాలను వెలుగులోకి తెచ్చారు. సిద్ధార్థుడిగా ప్రారంభమైన ఆయన జీవితం ఎన్నో సందేహాలతో తపోధనుడై.. బుద్ధుడిగా.. తథాగతుడిగా మారిన తర్వాత ధార్మిక, ఆధ్యాత్మిక వెలుగులు విరజిమ్ముతూ ప్రపంచాన్ని శాంతి మార్గం వైపు నడిపించారు. ఎన్నో ప్రాంతాలు ఆయన బోధనలు, ఉద్బోధతో పునీతమైనట్టే 'అనంత'లోనూ ఆయన ఆనవాళ్లు ఉండటం చరిత్రపై మక్కువ ఉండేవారికి ఆసక్తికరంగా అనిపిస్తుంది. సోమవారం బుద్ధ జయంతి సందర్భంగా ఆ విశేషాలు మీకోసం.

నగరంలో తథాగతుడి ఆనవాళ్లు..

పూర్వం రోజుల్లో చక్రవర్తులకు ప్రీతిపాత్రంగా మారిన బౌద్ధం దేశమంతటా విస్తరించినా ఇక్కడి ప్రాంతాల్లో మాత్రం అతి తక్కువగా ఉండేది. ఆయన బోధనల ప్రభావం అప్పటితో పోలిస్తే మారుతున్న కాలానుగుణంగా ఇప్పుడు మళ్లీ మంచి ప్రాచుర్యంలోకి వస్తోంది. ఎంతో మంది సాహితీవేత్తలు ఆయన జీవితాన్ని ఆకట్టుకునేలా అనంత ముగింటకు చేర్చారు. 'మహాబోధి సాహిత్య వేదిక'ను ప్రారంభించిన దాసన్నగారి కృష్ణమూర్తి బౌద్ధ అనయాయులతో కలిసి నగరంలోని హౌసింగ్ బోర్డులో బుద్ధ విహార్ ప్రాజెక్టు నేతృత్వంలో బౌద్ధ ధర్మాన్ని చాటుతూ 2019లో బుద్ధ పార్కు ఏర్పాటైంది. అక్కడే ఏర్పడిన ఓ గ్రంథాలయంలో బుద్ధుడి సమాచారంతో పుస్తకాలు అందుబాటులో ఉంచారు. విద్యుత్ నగర్‌లోని పార్కులో గౌతమ బుద్ధుడి విగ్రహం, దశాబ్దాల కిందటే విజయనగర్ కాలనీలో పిరమిడ్ ధ్యానకేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ బౌద్ధ విగ్రహాలు నిత్య ప్రార్థనలకు వేదికలు అవుతున్నాయి. అలాగే నగరంలోని పీస్ మెమోరియల్ హాల్‌లోకి అడుగు పెట్టగానే నిలువెత్తు బుద్ధుడి చరిత్ర తెలిపే పెయింటింగ్స్, తవ్వకాల్లో బయటపడిన విగ్రహాలు ఆకట్టుకుంటాయి. వేసవి సెలవుల్లో ఉండే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

నేడు 'బుద్ధ వందనం'

ఈసారి వచ్చే 2,569వ బుద్ధ జయంతి సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకూ స్థానిక ఆదర్శ నగర్‌లోని బుద్ధ విహార్ పార్కులో 'బుద్ధ వందనం' పేరిట వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మహాబోధి కృష్ణమూర్తి తెలిపారు. బుద్ధ విహార్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సాగే కార్యక్రమంలో తథాగతుడి జీవితంపై ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు.



బుద్ధ విహార్ పార్కులో కొలువుదీరిన ధ్యానముద్రలో తథాగతుడు

గుత్తి సమీపంలో శాసనాలు

అనంతపురం, కర్నూలు జిల్లాల సరిహద్దులకు ఆనుకుని ఉండే ప్రాంతాల్లో బయటపడిన అతి ప్రాచీన శాసనాల్లో గౌతమ బుద్ధుడి ప్రస్తావన ఉంది. అనంతపురం జిల్లాలోనూ బౌద్ధమతం వ్యాప్తి చెందిందనేందుకు గుత్తి పట్టణానికి కొన్ని కిలోమీటర్ల సమీపంలోని ఎర్రగుడి శాసనం తార్కాణం. జొన్నగిరి వద్ద లభించిన అశోకుడి కాలం నాటి శిలాశాసనాలే తార్కాణంగా బుద్ధుడి బోధనలు జిల్లా పరిసరాల్లోనూ ఉన్నాయని స్పష్టం అవుతోంది. సంస్కృత భాషను ఉపయోగిస్తూ బ్రాహ్మి లిపిలో పెద్ద రాతి బండలపై లిఖించిన శాసనాల్లో గౌతమ బుద్ధుడి సూక్తులు ఉన్నట్లు పరిశోధకులు కనుగొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



వడ్డుపల్లి నరసింహారెడ్డిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని గ్రీవెన్స్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వడ్డుపల్లి నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి మాజీ ఎమ్మెల్యే, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. గతంలో కూడా వైఎస్సార్‌సీపీ తనను నమ్మి మండల కన్వీనర్‌గా, హిందూపురం పార్లమెంట్ జిల్లా జనరల్ సెక్రటరీగా, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ప్రజలకు నిరంతరం అండగా ఉంటామని ప్రకాష్‌రెడ్డి తెలియజేశారు. అనంతరం నరసింహారెడ్డికి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ నాయక్, ఈశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, నాగరాజు, చిన్నా (శంకర్‌నారాయణరెడ్డి) తదితరులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్‌కు అనంత, కదిరి జట్లు



మ్యాచ్ ప్రారంభానికి ముందు చంద్రమోహన్‌కు నివాళులర్పిస్తున్న క్రీడాకారులు

అనంతపురం: సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు చంద్రమోహన్ స్మారకార్థం నిర్వహిస్తున్న టోర్నీలో సెమీఫైనల్‌కు అనంతపురం రైజింగ్ స్టార్, కదిరి జట్లు చేరుకున్నాయి. తాడిపత్రి దినేష్ గ్రానైట్స్, అనంతపురం రైజింగ్ స్టార్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో దినేష్ గ్రానైట్స్ జట్టు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసింది. 17.1 ఓవర్ల వద్ద పది వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంత రైజింగ్ స్టార్ జట్టు 17 ఓవర్లలోనే 7 వికెట్లు కోల్పోయి 114 పరుగులతో విజయాన్ని కైవసం చేసుకుంది.

- కదిరి, తాడిపత్రి ఎలెవన్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో కదిరి జట్టు తొలుత బ్యాటింగ్ చేపట్టి 62 పరుగులు చేసింది. జట్టులో పి. గిరినాథ రెడ్డి 45 పరుగులు , వి.భాను ప్రకాష్ 30 పరుగులు, కె.ప్రశాంత్ 39 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తాడిపత్రి ఎలెవన్ జట్టు 131 పరుగుల వద్ద చతికిలపడింది. దీంతో అనంతపురం రైజింగ్ స్టార్, కదిరి జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. మాజీ రంజీ ఆటగాడు షాబుద్దీన్, ఏడీసీఏ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, సెక్రెటరీ వి. భీమలింగా రెడ్డి, వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దౌర్జన్యాలు దుర్మార్గం



మాట్లాడుతున్న అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, మూడే శ్రీనివాసులు నాయక్, మల్లెమీద నరసింహులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో మహిళలపై కక్ష్యలు, దౌర్జన్యాలు, అఘాయిత్యాలు పెచ్చుమీరిపోయాయి. మాజీ మంత్రి విడదల రజినీపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. ఓ మాజీ మంత్రికే రక్షణ లేకుండా పోతే ఇక మిగతా వారి పరిస్థితి ఏమిటని వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులు ధ్వజమెత్తారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీసుల తీరును తప్పుబట్టారు. రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన నడుస్తోందన్నారు. సీఎం చంద్రబాబు కనుసన్నల్లో పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసి కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రిగా సేవలందించిన విడదల రజినీపై ఓ సీఐ సభ్య సమాజం తలదించుకునేలా బహిరంగా తోసేసి, కేసు నమోదు చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. అదేవిధంగా ఎంటీటీసీ కల్పనను అర్ధరాత్రి 3 గంటలకు ఇంటికి వెళ్లి స్టేషన్‌ను తరలించారన్నారు. మహిళలకు కనీస మర్యాద కూడా ఇవ్వని పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయన్నారు. హోంమంత్రి అనిత రాష్ట్రానికి మంత్రినా? లేక చంద్రబాబు నాయుడు ఇంటికి మంత్రినా అని ప్రశ్నించారు. హోంమంత్రి అనిత తన పదవికి రాజీనామా చేసి సీఎం చంద్రబాబు ఇంటిగేటుకు కాపలా కాయాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిద్రపోతున్నారన్నారు. తక్షణం సీఐను సస్పెండ్ చేసి మాజీ మంత్రి విడదల రజినీకి క్షమాపణ చెప్పకపోతే న్యాయపరంగా ముందుకెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, మల్లెమీద నరసింహులు, మూడే శ్రీనివాస్ నాయక్, లక్ష్మణ్ణ, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, రాష్ట్ర నాటక అకాడమీ మాజీ చైర్‌పర్సన్ రాగే హరిత, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మాలపాటి శ్రీనివాసులు, మహిళ నాయకురాళ్లు శోభారాణి, భారతి, రాధాయాదవ్, శోభాబాయి, ఎస్టీ నాయకులు హరినాయక్, సాకే ఆనంద్ పాల్గొన్నారు.

దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం



జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

అనంతపురం అర్బన్: కేంద్రంలోని మోదీ సర్కార్ అవలంభిస్తున్న తీరుతో దేశంలో ఎన్నడూ లేనంతంగా నిరుద్యోగం పెరిగిందని, ప్రభుత్వ లెక్కలే ఇందుకు నిదర్శనమని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న అన్నారు. డిగ్రీ పూర్తైన 25 ఏళ్ల వయసులోపు ఉన్న యువతలో 43 శాతం మంది నిరుద్యోగులే ఉన్నారన్నారు. స్థానిక హెచ్చెల్సీ సమీపంలోని మెడికల్ రెప్స్ హాల్‌లో నిర్వహించిన డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలకు ఆ సంఘం రాష్ట్ర మాజీ నాయకుడు రామిరెడ్డితో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం పోరాటాలు సాగిస్తామన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా కొత్త ఉద్యోగాలు అటుంచి ఉన్న ఉద్యోగాలు ఊడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2017–2022 మధ్య రెండు కోట్ల మంది మహిళలు ఉపాధి కోల్పోయినట్లుగా కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయన్నారు.

నిరుద్యోగ భృతి ఎక్కడ?

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ పేరుతో రాజకీయ లబ్ధిపొందుతోందని, నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపడం లేదని మండిపడ్డారు. పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు జరుగుతున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చేస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేని పాలకులు కుల, మత విద్వేషాలు రెచ్చగొడుతూ యువత ఐక్యతకు చిచ్చుపెడుతున్నాయని మండిపడ్డారు.

నూతన కమిటీ ఎన్నిక..

జిల్లా మహాసభల సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాలకృష్ణ, కార్యదర్శిగా కసాపురం రమేష్, కోశాధికారిగా చరణ్‌కుమార్‌ని ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా సురేంద్ర, అశోక్, నూరుల్లా, సహాయ కార్యదర్శులుగా సోము, నెట్టికల్లుతో పాటు కమిటీ సభ్యులనూ ఎన్నుకున్నారు.



హంపాపురం సమీపంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

నిలువెత్తు నిర్లక్ష్యం

రాప్తాడు మండలం హంపాపురం గ్రామ సమీపంలో వ్యవసాయ పొలాల మధ్యలో రోడ్డు వెంబడి చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. రామినేపల్లి, గొల్లపల్లి, మరూరు గ్రామాల్లో రైతుల పొలాల్లో విద్యుత్ స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటిని మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు వినతులు ఇస్తున్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు.

– రాప్తాడు:

ఆర్డీటీ లేని అనంతను ఊహించుకోలేం



ఆత్మకూరులో ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఆర్డీటీ లేని అనంతపురం జిల్లాను ఊహించుకోలేం. అనంత జిల్లాకు ఆర్డీటీ సహకారం ఎంతో అవసరమని పలువురు తెలిపారు. ఆదివారం ఆత్మకూరులో బంధూక రవితేజ ఆధ్వర్యంలో సేవ్ ఆర్డీటీ–సేవ్ అనంత కార్యక్రమంలో భాగంగా ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్డీటీ అనంతపురం జిల్లా రైతులకు సహాయ సహకారాలు అందించిందని తెలిపారు. క్రీడాకారులు, విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరేలా అండగా నిలిచిందని కొనియాడారు. ఎస్సీ నాయకులు రామాంజనేయులు, ఆత్మకూరు యువత నాగరాజు, బంధూక ఇంద్రతేజ, వెంకటేష్, ఓబన్న, వెంకటేష్, అనిల్ కుమార్, సతీష్, అరవింద్, ఈశ్వరయ్య, ఆనంద్, అరుణ్, రమేష్ మనోహర్ రెడ్డి, వెంకటేష్, ఓబన్న, సంజయ్, సోము, శ్రీధర్, హరి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్డీటీని కాపాడుకునేందుకు కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఫెర్రర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా క్రికెట్ కోచ్ టీవీ చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్డీటీ ద్వారా ఎంతో మందికి క్రీడా రంగంలో రాణించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీని ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. అఖిల పక్ష కమిటీ నాయకులు హరి, శ్రీనివాసులు, ఓబులేసు, టీవీ రెడ్డి, ఆనంద్, ప్రభాకర్, భీమసేనారావు, మంజునాథ్, రామకృష్ణ, పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.4.24 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.4.24 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ కె.గోవిందు తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత నుంచి రూ.2,68,290 వసూలు కాగా.. ఆదివారం జరిగిన ఆవులు, ఎద్దుల సంత ద్వారా రూ.1,56,230 మేర వసూలైనట్లు పేర్కొన్నారు.

ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్టకు విరాళం



నగదు అందజేస్తున్న సాదిక్ వలి

అనంతపురం రూరల్: రుద్రంపేట పంచాయతీ పంతులకాలనీలో నూతన దేవాలయంలో ఏర్పాటు చేస్తున్న ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠకు వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సాదిక్‌వలి, రుద్రంపేట ఎంపీటీసీ–4 సభ్యురాలు మహబూబీ రూ.10 వేలు విరాళం అందజేశారు. రుద్రంపేట పంచాయతీ అభివృద్ధి కోసం తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరాముడు, అక్కమ్మ, మహబూబ్‌బాషా, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మెడిక్యూర్ ఆస్పత్రిలో మదర్స్ డే



మాట్లాడుతున్న ఆస్పత్రి నిర్వాహకులు

అనంతపురం మెడికల్: నగరంలోని మెడిక్యూర్ ఆస్పత్రిలో ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవం (మదర్స్ డే) నిర్వహించారు. గైనకాలజిస్టు డాక్టర్ నిస్సీ వినూత్న, సర్జన్ డాక్టర్ ఫణి మహేష్ రెడ్డి, డాక్టర్ సురేష్‌కుమార్ మదర్స్ డే ప్రాముఖ్యతను తెలియజేశారు. గైనకాలజిస్టు డాక్టర్ నిస్సీ వినూన్న సాధారణ ప్రసవం, కష్టతరమైన సిజేరియన్ జరిగిన విధానాన్ని తల్లుల ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మురళీ నాయక్ ప్రాణత్యాగం వృథా కాదు



మురళీ నాయక్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

గోరంట్ల: పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ ప్రాణత్యాగం వృథా కాదని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్‌తో కలసి ఆదివారం గోరంట్ల మండలం కల్లితండాకు విచ్చేసిన ఆయన... మురళీనాయక్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరజవాన్ తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం మురళీనాయక్ చేసిన పోరాటం లక్షలాదిమంది యువతకు స్ఫూర్తినిచ్చిందన్నారు. వీరజవాన్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందన్నారు.

స.హ. చట్టాన్ని బలోపేతం చేయాలి

అనంతపురం కల్చరల్: జిల్లా కలెక్టర్లు, డీఆర్వోలు నిర్లక్ష్యంగా ఉండడంతోనే పరిపాలనలో పారదర్శకత లోపించిందని ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ రాజు అన్నారు. ఆదివారం స్థానిక హౌసింగ్ బోర్డులోని విద్యుత్‌కళావేదికలో ఆర్టీఐ ప్రజా సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం డీఆర్వోకు ఎన్ని ఫిర్యాదులు చేసినా జీఓలు, కోర్టు ఆదేశాలెన్ని ఉన్నా కలెక్టర్ దృష్టికి ఏ సమస్యను తీసుకెళ్లడం లేదన్నారు. స.హ చట్టం యాక్టివిస్టులను బెదిరింపు ధోరణితో చూడడం విచారం కలిగిస్తోందన్నారు. అధికారులు, పోలీసుల్లో పారదర్శకత రావాలంటే సమాచార హక్కు చట్టం బలోపేతం కావాలన్నారు. సమాచార హక్కు ఐక్యవేదిక వ్యవస్థాపకుడు లాల్యనాయక్, సమాచార హక్కు పరిరక్షణ సంఘం హొన్నూరప్ప, జై జనజాగృతిసంస్థ జనార్దన రెడ్డి, సింధూర్ ఆర్గనైజేషన్ పుష్పావతి, కొండయ్య, సుధాకర్, నాగరాజు పాల్గొన్నారు.